



చిలమత్తూరులో పరీక్షకేంద్రానికి పరుగులు తీస్తున్న విద్యార్థులు

అసౌకర్యాల నడుమ 'పది' పరీక్షలు

ప్రజాశక్తి యంత్రాంగం

శ్రీసత్యసాయి జిల్లాలోని పలు 'పది' పరీక్షకేంద్రాల్లో నెలకొన్న అసౌకర్యాల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా చిలమత్తూరు మండలంలో నిర్వహించిన పది పరీక్షల్లో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అధికారుల తీరు వల్ల ప్రయివేటు పాఠశాలను పది పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు నానా పాట్లు పడ్డారు. బస్‌స్టాండ్‌కు పరీక్ష కేంద్రానికి దూరం ఎక్కువగా ఉండటం వల్ల సమయం దాటుతుందని విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉరుకులు, పరుగులు తీశారు. పరీక్ష కేంద్రం చేరుకోవడానికి ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చిన విద్యార్థులు జడ్పీహెచ్ ఎస్ స్కూల్ ముందు మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇలా తొలిరోజు పదోతరగతి తెలుగు పరీక్ష కోసం విద్యార్థులు అవస్థలు పడ్డారు. ఇక వైద్యసిబ్బంది తగినంత మందిని పరిక్ష కేంద్రం వద్ద కేటాయించలేదు.ఈ విషయంపై డిప్యూటీ డిఎంహెచ్ఒను ఫోన్‌లో సంప్రదించగా సిబ్బంది కొరత ఉందని చెప్పుకొచ్చారు.ఎట్టకేలకు ఇద్దరు ఆశాలను, ఒక సూపర్ వైజర్,ఒక హెల్త్ అసిస్టెంట్‌ను కేంద్రం వద్ద ఏర్పాటు చేశారు.

ప్రశ్నార్థకంగా 'పది' విద్యార్థి భవితవ్యం

చిలమత్తూరు : చిలమత్తూరు మండలానికి చెందిన ఓ వికలాంగ విద్యార్థి భవిష్యత్తు ఆ పాఠశాల హెచ్ఎం తప్పిందం వల్ల ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని కోడూరు పాఠశాల పది విద్యార్థి వరుణ్ కుమార్ రెడ్డి వికలాంగుడు (ఇంటలాక్టువలీ డిసబులిటీ). పరీక్ష రాయడానికి విద్యార్థికి శరీరం సహకరించదు. తనకు తోడుగా మరొకరితో పరీక్ష రాయించడానికి అవకాశం ఉంటుంది. అయితే అందుకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరీక్ష ఫీజు చెల్లించనపుడే డిసబుల్ సర్టిపికేట్‌తో దరఖాస్తు చేయించాలి. అయితే ఆ పని చేయని కారణంగా విద్యార్థి ఒక్కడే పరీక్ష రాయాల్సి వచ్చింది. శరీరం సహకరించక ఆ విద్యార్థి ఏమి రాయకుండానే వెనుతిరిగాడు. దీంతో వికలాంగ విద్యార్థి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తండ్రి మరణం అనంతరం విద్యార్థిని అత్యంత కష్టం మీద తల్లి చదివిస్తోంది. మంచి చదువులు చదివించాలని తన కోరిక అయితే తన కొడుకు పదిపరీక్షల పట్ల విద్యాశాఖ నిర్లక్ష్యంపై తల్లి ఆవేదన చెందింది. ఈ విషయంపై ఎంఇఒను సంప్రదించగా హెచ్ఎం తప్పిదమే అని చెప్పుకొచ్చారు. ఇక డిసబుల్ సర్టిఫికేట్, హాల్ టికెట్ ఆధార్ ఆధారంగా విద్యార్థికి (స్క్రైబ్) వాలెంటీర్‌ను పరీక్ష కేంద్రం చీప్ అనుమతించవచ్చని తెలుస్తోంది. అయితే అలాంటి చర్యలు విద్యాశాఖ చేపట్టకపోవడంతో విద్యార్థిని ఆవేదనకు గురయ్యాడు.



వికలాంగ సర్టిఫికెట్ చూపుతున విద్యార్థి

పకడ్బందీ ఏర్పాట్లు

కొత్తచెరువు రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా సోమవారం 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డిఇఒ మీనాక్షి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 115 సెంటర్లలో సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 23816 విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 22862 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. పెనుగొండ డివిజన్లో 63 సెంటర్లలో 12663 మందికి గాను 12128 మంది విద్యార్థులు హాజరయ్యారయ్యారన్నారు. ధర్మవరం డివిజన్లో 52 సెంటర్లలో పరీక్షలు జరగగా, 11153 మందికి గాను 10734 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ఇసుకాసురులు



'పెన్నా'ను తోడేస్తున్న స్వార్థపరులు
అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా
పగలు పట్టణానికి...రాత్రి కర్నాటకకు తరలింపు
పట్టించుకోని అధికారులు

హిందూపురం ప్రాంతంలో అధికారుల అండదండలతో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పూవులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. అభివృద్ధి పనుల కోసం ఇసుక దొరకడం కష్టంగా మారడంతో ఎక్కడిక్కడ పనులు నిలచి పోయాయి. అదే అక్రమ రవాణాకు మాత్రం ఇసుక ఎంత కావాల్సినా హిందూపురం ప్రాంతంలో దొరుకుతోంది. ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో పెన్నా నది వద్దే బిల్లులు ఇస్తు ఇసుక దోపిడీ చేస్తున్న ఎవరు పట్టించుకోవడం లేదు. మూడు రోజుల క్రితం పురపాలక సంఘ ఆధీనంలో మొత్కుపల్లి వద్ద ఉన్నా కంపోస్టు యార్డు భూమిలో ఇసుక లభిస్తుండడంతో దానిని శుభ్రం చేసి, అందులో దొరికే ఇసుకతో అభివృద్ధి పనులను చేసుకోవడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే వెంటనే సెబ్ అధికారులు అక్కడి వెళ్లి అనుమతులు లేకుండా ఎలా తరలిస్తారంటూ అడ్డుకున్నారు.



పెన్నానదిలో ఇసుకను ట్రిపర్‌లోకి వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములతో పాటు నది పరివాహక ప్రాంతాలలో గత కొన్ని నెలలుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఇసుక తరలుతోంది. వీరు తమ సంస్థకు ఇసుక తీసుకెళ్లడానికి ప్రభుత్వం జీవో ఇచ్చిందని కాగితాలను చూపిస్తు ఇసుకను తోడేస్తున్నారు. పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధిత శాఖ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ అనుమతులను ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు అనుమతి ఇచ్చిన చోట కాకుండా వేరే చోట తవ్వకాలు జరుపుతూ రూ.లక్షల విలువ చేసే ఇసుకను గుట్టుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. అనుమతి ఒకచోట, తవ్వకాలు మరోచోట చేస్తున్నారని తెలుస్తోంది. బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా కర్నాటకకు తరలిస్తు లక్షలు దండుకుంటున్నారని విమర్శలు వినపడుతున్నాయి. ఇసుక అవసరం ఉన్న వారు ట్రాక్టర్ తీసుకెళ్లి ఇసుక కావాలంటే ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వారికి రూ.2500 కప్పం కడితే వారు బిల్లు ఇస్తారు. అది తీసుకుని కూలీలను వారే ఏర్పాటు చేసికుని ఇసుకను తీసుకు వెళ్లాల్సుంది. దీంతో కొంత మంది అక్కడ రూ.2500 కొని, రూ.4వేల నుంచి రూ.4,500 వరకు అమ్ముకుంటున్నారు. పెన్నా నదిలో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరపడంతో పరివాహక గ్రామాల్లో భూ గర్భజలాలు అడుగంటుతున్నాయని తవ్వకాలు నిలిపివేయాలని పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రీచ్ లేకుండానే అనుమతులు మంజూరు

ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలంటే ఇసుక రీచ్‌ను గుర్తించి, భూగర్భ గనుల శాఖ అధికారులు వచ్చి ఇన్ని క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు జరపాలని సూచించాలి. అయితే హిందూపురం ప్రాంతంలో ఇసుక రీచ్ ఒక్కటి కూడా లేదు. ఇసుక దొరకడం కష్టంగా ఉందని, గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం అయినా ఒక రీచ్ ఇవ్వాలని గతంలో వైసిపి నాయకులు మహమ్మద్ ఇక్బాల్ కలెక్టర్ తో పాటు రాష్ట్ర స్థాయిలో భూగర్భ గనుల శాఖ అధికారులను కోరారు. అయినప్పటికీ రీచ్‌కు అనుమతించలేదు. అయితే ప్రస్తుతం రీచ్‌కు ఎలా అనుమతులు ఇచ్చారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఎక్కడ రీచ్ ను గుర్తించారు, ఎప్పుడు గుర్తించారు అన్నది సందేహంగా మారింది.

అభివృద్ధి పనులకు దొరకని ఇసుక

హిందూపురం పురపాలక సంఘంతో పాటు రూరల్ మండలాల్లో ఇసుక దొరకక ఎన్నో అభివృద్ధి పనులు నిలచి పోయాయి. ఇసుక రీచ్ ఇక్కడ లేక పోవడంతో నాడు-నేడు, ఆరోగ్య ఉపకేంద్రాలతో పాటు ఆర్‌బికే, నూతన సచివాయాల నిర్మాణాలతో పాటు సిసి రోడ్లు, మురుగు కాలువలతో పాటు చివరకు పక్కాగృహాలకు కూడా ఇసుక లభించలేదు. ఇసుక లభించక ఇప్పటికీ ఒక్క హిందూపురం పురపాలక సంఘంలోనే కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

నో చెక్‌పోస్టు.. నో చెకింగ్

హిందూపురం కర్నాటక సరిహద్దులో ఉంది. ఇక్కడ గతంలో చెక్ పోస్టును ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేవారు. ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తే ఇసుక తవ్వకాల వద్ద సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కానీ నిఘా ఉండాలి. ఇసుక రీచ్‌ల వద్ద వేమిషన్, సీసీ కెమెరాలు, ఇసుకను తరలించే లారీలకు, టిప్పర్‌లకు జీపీఎస్ ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ సంబంధిత అధికారులు వీటిలో వేటినీ ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది. అదేవిధంగా ఇసుక రీచ్‌ల నుంచి లోడ్‌తో వెళితే టిప్పర్‌లను, లారీలను నిత్యం తనిఖీ చేసేందుకు స్థానికంగా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడ చెక్‌పోస్ట్ లేకపోవడంతో ఎలాంటి వే బిల్లులు లేకుండా భారీ టిప్పర్లు, లారీల్లో ఇసుకను యథేచ్ఛగా సరిహద్దులను దాటించేస్తున్నారు. జిల్లా ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచాల్సి ఉండగా స్థానికంగా కాకుండా కర్నాటక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతిరోజూ రూ.లక్షల విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ప్రభుత్వా నికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ఇదంతా సంబంధిత శాఖ అధికారులతో పాటు స్థానిక రెవిన్యూ, మైనింగ్, పోలీసులకు తెలిసినప్పటికీ ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఇచ్చిన బిల్లును చూపిస్తున్న ఇసుక ట్రాక్టర్ డ్రైవర్

కరాటేలో ఒడిసి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని శ్రీవిజ్ఞాన్ సిబిఎస్ఈ పాఠశాల ఆవరణలో సోమవారం మాస్టర్ షాకీర్ ఆధ్వ ర్యంలో కరాటే బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా స్కూల్ ఛైర్మన్ మస్తాన్, హెచ్ ఎం రంగారెడ్డి హాజరై మాట్లాడుతూ కరాటే వల్ల ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు కరాటే అవసరమన్నారు. అనంతరం బెల్ట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. అందులో 31 మంది విద్యార్థులు పాల్గొని వైట్ నుంచి ఎల్లో బెల్ట్‌కి అర్హత సాధించారు. విద్యార్థులకు ముఖ్య అతిథులు ఎల్లో బెల్ట్, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు రంజిత్, చాందిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి కదిరి టౌన్

ఆశాల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కోనేరు వద్దగల కళ్యాణ మండపంలో సిఐటియు అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు జిల్లా కార్యద్శి వెంకటేష్, జివెల్ నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు కదిరిలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాజకీయ అంశం సిఐటియు విశిష్టత అనే అంశంపై వారు మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో విశిష్ట సేవలు అందించిన ఆశా వర్కర్ల కష్టాలు పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల కార్మికుల సమస్యలను పెడచెవిన పెట్టిందనివిమర్శించారు. ఆశాలు విద్య, వైజ్ఞానిక శాస్త్రీయ ఆలోచనలతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశా వర్కర్ యూనియన్ సౌభాగ్య, సాంబశివ, జగన్, బబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి వైసిపిలో అసమ్మతి సెగ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తిలో వైసిపికి అసమ్మతి సెగ తగిలింది. వారం రోజుల్లో తమ భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయం ప్రకటిస్తామని వైసిపి రెబల్ నాయకలు ప్రకటించారు. సోమవారం స్థానిక గోకుల్ సూపర్ బజార్ అతిథిగృహంలో వైసిపి నాయకులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాముదుర్తి రవీంద్ర రెడ్డి తనయుడు ఇంద్రజిత్ రెడ్డి, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, పాముదుర్తి సర్పంచి కృష్ణమూర్తి వారి అనుచరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాము వైసీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశామన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి టిక్కెట్టు ఇవ్వరాదంటూ అధిష్టానం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లామన్నారు. అయితే అధిష్టానం తిరిగి ఆయనకు టికెట్టు ఇచ్చిందన్నారు. టికెట్ ఇచ్చే ముందు అధిష్టానం తమను పరిగణించకుండా అవమానించిందన్నారు. టికెట్టు కేటాయించిన రెండు రోజుల తరువాత అధిష్టానం నుంచి ఈరోజు పిలుపు వచ్చిందన్నారు. అధిష్టానం ఏం చెబుతుందో చూసి ఆ తరువాత తమ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న అసమ్మతి నాయకులు

పేదల సమస్యలపై అధికారులు స్పందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

న్యాయబద్ధంగా చట్టం ప్రకారం పేదలకు న్యాయం చేసేందుకు అధికారులు చొరవ చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. పేదల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ బాబు, తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ పెనుకొండ పట్టణానికి చెందిన ఇల్లు లేని నిరుపేదలు హైకోర్టు ఉత్తర్వుల ద్వారా స్వాధీన స్థలాలలో ఇళ్లనిర్మాణ పనులు చేపడుతుంటే వాటిని అడ్డుకొని కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడడం అన్యాయమన్నారు. ఇది హైకోర్టు ఉత్తర్వుల (28232/2023) ధిక్కరణ కిందకు వస్తుందని అధికారుల తీరుపై హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా సోమందేపల్లి మండలం సోమందేపల్లి, గుడిపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో సర్వే నంబర్ 733, 83లో గల వందలాది ఎకరాల బీడు భూములను 1975 భూ పరిమితుల చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుని చుట్టుపక్కల గ్రామాలలో భూమిలేని నిరుపేద దళిత , గిరిజన , బలహీన వర్గాల కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆ భూమిలో ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలకు చట్టబద్ధ హక్కుల కల్పించి న్యాయం చేయాలని కోరారు. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో పేదలకు భూములు పంచుతామని, పేదల ఐక్యతతో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నిర్మాణ పనులు చేపట్టి కాలనీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న , కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, సిపిఎం స్థానికనాయకులు తిప్పన్న , ఇళ్ల స్థలాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ వర్షిని, పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఏర్పాటుకు హైకోర్టు సానుకూలం

పుట్టపర్తి ప్రజాశక్తి రూరల్

పుట్టపర్తి జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా స్పందించిందని పుట్టపర్తి బార్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. పుట్టపర్తి బార్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి అధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు లెక్కల యదుభూషన్, కృష్ణప్రసాద్ తో కూడిన బృందం జిల్లా జడ్జి శ్రీనివాస్‌ను సోమవారం కలసి ప్రతిపాదనలతో కూడిన లేఖను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నెల 26న ప్రశాంతినిలయానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి మన్మధరావుకు పుట్టపర్తి బార్ అసోసియేషన వినతిపత్రం అందజేసిందన్నారు. నూతనంగా ఏర్పడిన సత్యసాయి జిల్లా లో జిల్లా కోర్టు తో పాటు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ఆ వినతి పత్రంలో కోరామన్నారు. దీంతో హైకోర్టు జడ్జి పుట్టపర్తి బార్ అభ్యర్ధనకు సానుకూలంగా స్పందించారన్నారు. టేరిటోరియల్ జ్యూరిసిడిక్షన్ (ప్రాదేశిక పరిధితో కూడిన)ప్రతిపాదనలు పంపాలని హైకోర్టు ఆర్ఒసి నంబర్ 54 - ఇఎన్ - 2024 తేదీ 20/02/2024 మేరకు పుట్టపర్తి బార్ వినతి పత్రాన్ని జతపరుస్తూ లేఖ రాసిందన్నారు. జిల్లా కోర్టుతో పాటు సీనియర్ సివిల్ డివిజన్ కోర్టును విస్తృత పరచడానికి అవసరమగు సమగ్ర ప్రతిపాదనలు పంపాలని జిల్లా జడ్జిని ఆ లేఖ ద్వారా ఆదేశించిందన్నారు. జిల్లా జడ్జికి పంపిన లేఖలో పుట్టపర్తి బార్ నుండి (టేరిటోరియల్ జ్యూరిసిడిక్షన్) ఏర్పాటుకు ప్రాదేశిక పరిధి తో కూడిన మండలాల వివరాలు క్రిమినల్ సివిల్ కేసుల వివరాల తో కూడిన ప్రతిపాదనలు అందజేయాలని కోరిందన్నారు. ప్రధానంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో ఉన్న పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నంతో పాటు గోరంట్ల, నల్లమాడ, ఓబుళదేవుర చెరువు, అమడగూరు మండలాలను కలుపుతూ ప్రాదేశిక పరిధితో కూడిన సీనియర్ సివిల్ డివిజన్ కోర్టు ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో జిల్లా జడ్జి పుట్టపర్తిలో కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు హైకోర్టు సానుకూలంగా ఉందని. ఇందుకోసం డిటైల్డ్ రిపోర్ట్ ను పంపాలని అదేశించిందని చెప్పారన్నారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు పది ఎకరాలు కేటాయించాలని జిల్లా కలెక్టరుకు లేఖ ను కూడా పంపామని తెలిపారు.



జిల్లా జడ్జికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

'ఓపెన్' పరీక్షల్లో యథేచ్ఛగా మాస్‌కాపీయింగ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రెగ్యులర్ పదో తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు(దూర విద్య ద్వారా) నిర్వహించారు. అయితే దూరవిద్య పరీక్షల్లో కొందరు స్వార్థపరులు అమాయకులను లక్ష్యంగా చేసుకొని ధనార్జనే ధ్యేయంగా మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా పాస్ చేయిస్తామని నమ్మబలికి విద్యార్థుల నుంచి రూ. 8వేల నుంచి రూ. 10 వేలు అదనంగా దండుకుని ఓ విద్యార్థి రాయాల్సిన పరీక్షలను మరో వ్యక్తితో రాయిస్తున్నారు. ఈ క్రమంలో హాల్ టికెట్లలో ఫొటో మార్చి పరీక్ష కేంద్రానికి పంపారు. పరీక్ష కేంద్రాల్లోని చీఫ్ ఇన్విజిలేటర్లు నకిలీ విద్యార్థులను గుర్తించి బయటికి పంపించేశారు. పరీక్ష కేంద్రాల్లో తమ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మాస్‌కాపీయింగ్‌కు అడ్డుచెప్పకుండా ఉండేందుకు కోఆర్డినేటర్లు తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులను చీఫ్ ఇన్విజిలేటర్లు, ఇన్విజిలేటర్లుగా నియమించుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం. అటెండర్ల ద్వారా ప్రశ్నపత్రాలను బయటకు తెప్పించి వారి ద్వారానే సమాధాన పత్రాలు చేరవేసి మాస్ కాపీయింగ్ చేయిస్తున్నట్లు సమాచారం. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నా ఎక్కడా అమలు కాలేదనే చెప్పవచ్చు. కోఆర్డినేటర్లు యథేచ్ఛగా పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్నా నియంత్రించే వారే లేరన్న విమర్శలు ఉన్నాయి. పది, ఇంటర్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలని పరీక్షలకు ముందే డిఇఒను కోరినా ఫలితం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్‌జాన్ పేర్కొన్నారు. కోఆర్డినేటర్లు, ఇన్విజిలేటర్లు కుమ్మక్కై మొదటి రోజే యథేచ్ఛగా మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించారని మండిపడ్డారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : జెసి

ప్రజాశక్తి- హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న జెసి అభిషేక్ కుమార్

ఎన్నికల విధులను అధికారులు చట్టబద్ధతతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎన్నికల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నా రు. అన్ని రాజకీయ పార్టీలను, అభ్యర్థులను ఒకేలా చూడాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి ఆ అభ్యర్థి ఖర్చు చేసే ప్రతి పైసాను లెక్కించాలన్నారు. ఎన్ని వాహనాలు వాడుతున్నారు, ఎంత మంది వెంట ఉన్నారు, బహిరంగ సభలు, ర్యాలీలు, తదితర ప్రతి కార్యక్రమంపై వీడియోలు, ఫొటోలు తీయించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మోడల్ కోడ్‌ను కఠినంగా అమలు చేయాలన్నారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్ శివప్రసాదరెడ్డి, ఎంపిడిఒలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాగళం ఘన విజయం.. కూటమిదే అధికారం

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ



ప్రజాగళం ఘన విజయంతో కూటమిదే అధికారం అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో రాష్ట్రం సర్వ నాశనమైందని, అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎపి ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు ప్రజాగళం సభకు లక్షల్లో జనం వచ్చి తమ మద్దతు తెలిపారన్నారు. వైసిపి, కాంగ్రెస్‌పార్టీ ఒకే కుటుంబానికి చెందినవన్నారు. వైసిపి మంత్రులు అవినీతిలో పోటీ పడుతు న్నారని, జగన్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను అడ్డుకుందన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ అధ్వాన్నంగా మారాయన్నారు. జగన్ పాలన ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. కలెక్టరేట్‌లు, రైతుబజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలలతో సహా అనేక ప్రభుత్వ ఆస్తులను జగన్ ప్రభు త్వం తనఖా పెట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఘన విజయం సాధిస్తుం దన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాబోతున్నాయని తెలిపారు.

'మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుడిని'

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్

ప్రజాశక్తి-తలుపుల



ప్రజలతో మాట్లాడుతున్న మక్బూల్ అహ్మద్

ఇంతటి ఎండలో సైతం మీరు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆదరాభిమానాలకు కృతజ్ఞుడిని, మిమ్మ ల్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని కదిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే బిఎస్.మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని పెద్దన్నవారిపల్లి గ్రామపంచాయతీలోని సంగటివారి పల్లి, ఎగువపల్లి, వేము లగొంది గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా ఆయనకు ప్రతి గ్రామంలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. వందలాది బైక్‌లతో ఒకటిన్నర కిలోమీటర్ మేర ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, ఎస్ఎండి ఇస్మాయిల్, సాదత్ అలీఖాన్, కృష్ణారెడ్డి, కుర్లి శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పట్టణంలోని కుమ్మరిపేటలో ఇటీవల మృతిచెందిన మేదర చెన్నప్ప కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. చెన్నప్ప ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, తిప్పన్న, కౌన్సిలర్లు సూర్యగౌడ్, చెరువు భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుటుంబానికి..

ఓబుళదేవరచెరువు : మండలంలోని టి.కుంట్లపల్లెకు చెందిన మాజీ సర్పంచి రెడ్డప్పనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి రెడ్డప్ప నాయుడును పరామర్శించారు. అనంతరం కుంట్లపల్లి పంచాయతీలోని కుంట్లపల్లి, టానాకొత్తపల్లి, తాటిమేకలపల్లి, పెద్ద సానే వారి పల్లి, బసప్ప గారిపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ మద్దెరాజునాయుడు, షామీర్ బాషా, ఎర్రమనేని చంద్రమౌళినాయుడు ఉన్నారు.

టిడిపితోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి

ప్రజాశక్తి-పెనుకొండ



పార్టీలో చేరిన వారికి టిడిపి కండువా వేస్తున్న సవితమ్మ

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వివిధ మండలాలు, గ్రామాల నుంచి వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సవితమ్మ సమక్షంలో టిడిపిలో చేరారు. వారిలో మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు వైసిపి కార్యకర్తలు, మావుటూరు గ్రామానికి చెందిన 60 వైసీపీ కుటుంబాలు, రొద్దం మండలం చెరుకూరు గ్రామానికి చెందిన 15 వైసిపి కుటుంబాలు, పరిగి మండలం హొన్నంపల్లి, జంగాలపల్లి గ్రామాల నుంచి 5 కుటుంబాలు, ఎస్సీ కాలనీవాసులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ సవితమ్మ టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో పోలీసు కవాతు

ముదిగుబ్బ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిఐ యతీంద్ర ఆధ్వర్యంలో సోమవారం బిఎస్ఎఫ్, ఆర్మీ, పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా పాత ఊరి వరకూ కవాతు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రజలు సార్వత్రిక ఎన్నికలకు సహకరించాలని, పోలింగ్‌కు ముందు, తరువాత ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, తమ ఓటు హక్కును నిర్భయంగా ఎవరికీ భయపడకుండా వినియోగించుకోవాలన్నారు.



ఉషశ్రీచరణ్ సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

జగన్ పాలనలో మహిళలకు పెద్దపీట

పెనుకొండ : జగన్ హయాంలో మహిళలకు పెద్దపీట వేశారని పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆమె కార్యాలయంలో సోమవారం సోమందేపల్లికి చెందిన 30 కుటుంబాలు టిడిపిని వీడి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైసిపిలో చేరాయి. వారికి ఆమె పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందాం అని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, సోమందేపల్లి మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి బూత్ కమిటీ సభ్యులతో మంత్రి సమావేశం

వైసిపి గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీ సభ్యులు సైనికుల్లా పని చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయం వద్ద సోమవారం ఆమె పార్టీ బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. బూత్ కన్వీనర్, కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేసి మరోమారు వైసిపిని గెలిపించాలని కోరారు.

టిడిపి కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మడకశిర : మాజీ ఎమ్మెల్యే ఈరన్న సోమవారం నియోజకవర్గంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తల ను పరామర్శించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోపాలకృష్ణను హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. అమరాపురం మండలం మద్దన కుంట గ్రామానికి చెందిన నాగ న్న, రాఘవేంద్ర, తురకవాండ్లపల్లి గ్రామస్తుడు నాగరాజు వివిధ కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. టిడిపి తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఆదినారాయణ, అశ్వర్థమప్ప, రామాంజనేయులు, కృష్ణప్ప, హనుమంతేగౌడ్, శివరామకృష్ణ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పెనుకొండ : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి డీఎస్పీ బాజీజాన్ సైదాని, శివరామకృష్ణ సోమవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చలివేంద్రాన్ని ప్రారంభిం చారు. డీఎస్పీ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, బాబు, హనుమంతు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండలంలోని కాల్వేపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ రంగనాథస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి సోమవారం ఓ దాత రూ. 15,101 విరాళం అందజేశారు. కాల్వేపల్లి గ్రామానికి చెందిన లక్షుమ్మ, నారాయణప్ప కుటుంబ సభ్యులు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, ఎస్.తిమ్మప్ప, బండి రమేష్ తెలిపారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

మడకశిర : దళిత హక్కుల పరిరక్షణ సమితి(డిహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రి సౌజన్యంతో మండలంలోని ఆమిదాల గొంది గ్రామంలో ఉన్న శ్రీవెంకటేశ్వర వృద్ధాశ్రమంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వృద్ధాశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.తిమ్మారెడ్డి తెలిపారు. శిబిరంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచితంగా బిపి/ ఇసిజి/ 2డి ఎకో పరీక్షలు చేస్తారన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

మడకశిర : గర్భిణులు, బాలింతలు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సిడిపిఒ నాగమల్లేశ్వరి సూచించారు. 'పోషణ్ పక్వాడ్'లో భాగంగా సోమవారం రొళ్ల మండలంలోని అగ్రహారం అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ గర్భిణులు, బాలింతలకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం, సూపర్‌వైజర్ సన్నక్క, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

టిడిపి శంఖారావం ప్రారంభం

అమరాపురం : మండలంలోని గొల్లమారనహల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఎన్నికల శంఖారావం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. 2024 ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మహలింగప్ప, శివకుమార్, ఆనంద్, రంగప్ప పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి పరికరాలు వితరణ

పెనుకొండ : పట్టణంలోని ఆల్విన్ కాలనీ అంగన్వాడీ కేంద్రానికి ఎస్‌బిఐ వారు టీవీ, వాటర్ ఫిల్టర్, ఓవర్ హెడ్ ట్యాంక్, తదితర అవసరాలు సమకూర్చారని సిడిపిఒ డాక్టర్ జి.శాంతలక్ష్మి పేర్కొన్నారు. సెంటర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎం వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ ముమ్ముందు సహకారం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమం లో బ్యాంక్ మేనేజర్ రామయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ వి.పుష్పలత, ఎమ్.సుజాత, అంగన్వాడి వర్కర్ రాజేశ్వరి, హెల్పర్ మాబున్నీసా పాల్గొన్నారు.

రాజకీయ సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-పరిగి



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభారత్ మండలంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మండలంలో రాజకీయ పార్టీలకు సంబంధించి వాల్ పోస్టర్లు, నాయకుల విగ్రహాలకు ముసుగు వేయటం, తదితర అంశాలపై తనిఖీలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహిం చి ఎన్నికల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. రాజకీయ పార్టీలు బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీల ఏర్పాటు, సమావేశాల నిర్వహణపై మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విఆర్వోలు, వీఆర్ఏలు గ్రామాల్లో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాల న్నారు. ఆయన వెంట ఎంపిడిఒ సుహాసినమ్మ, తహశీల్దార్ రాజేశ్వరి ఉన్నారు.

చెరువులను నింపడమే ప్రథమ కర్తవ్యం

టిడిపి అభ్యర్థి పల్లె సింధూర

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి అభ్యర్థి పల్లె సింధూర

టిడిపి అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటితో నింపడమే ప్రథమ కర్తవ్యమని టిడిపి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఆమె సోమవారం మండలంలోని నాగిరెడ్డి పల్లి, వంగంపల్లి, ఇరగంపల్లి గ్రామాల్లో భర్త పల్లె వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టో, సూపర్ సిక్స్ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి పథకాలను వివరించారు. పల్లె సింధూర మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా ద్వారా నీళ్లు తీసుకొచ్చి సాగు, తాగునీరు అందిస్తామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. టిడిపితోనే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. కావున ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సాలక్కగారి వాణి శ్రీనివాస్, మండల కన్వీనర్లు వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, సురేష్‌నాయుడు, సర్పంచులు వెంకటేశ్, ఆంజనేయులు, కిష్టప్ప, కేశప్ప, రవి, హర్ష, శేషప్ప, లక్ష్మీ నారాయణ, కృష్ణ, కిరణ్, మాధవి, రాధమ్మ, లావణ్య పాల్గొన్నారు.

ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి : కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి అభ్యర్థి పల్లె సింధూర

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వచ్చే 50 రోజులూ ప్రతి కార్యకర్త యుద్ధంలో సైనికుడిలా పని చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణ సమీపంలోని పివిఆర్ గ్రాండ్‌లో సోమవారం బూత్ కమిటీ, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కందికుంట హాజరై మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు, టిడిపి శ్రేణులు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారన్నారు. అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బూత్ స్థాయి నుంచి సమిష్టిగా పని చేయాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి అడ్డదారుల్లో వైసిపి అభ్యర్థిని గెలిపించడానికి ప్రయత్నాలు చేస్తారని, వారి ఎత్తుగడలను తిప్పి కొట్టాలని సూచించారు. కార్యకర్తలు ఆస్తులను పోగొట్టుకున్నా టిడిపి జెండాను మాత్రం వదల్లేదన్నారు. మీ కష్టం వృథా కాకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. త్వరలోనే ప్రచార షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు కూర్చొని ప్రచార కార్యక్రమాలపై కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

టిడిపి కంచుకోటను బద్దలు కొడతాం

వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కంచుకోటగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతు వైసిపి కుటుంబ సభ్యులందరూ ఏకమై వచ్చే ఎన్నికల్లో హిందూపురం ఎంపిగా శాంతమ్మ, ఎమ్మెల్యే దీపికలను గెలిపించి అధినేత జగన్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, రాష్ట్ర డైరెక్టర్లు, మార్కెట్ యాడ్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండల, టౌన్ కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు పరికరాలు వితరణ

ప్రజాశక్తి-హిందూపురం



కాలేజీని సందర్శించిన బర్జర్ పెయింట్స్ కంపెనీ అధికారులు


కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న బర్జర్ పెయింట్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ తరపున జిఎం వెంకట అప్పారావు యాజమాన్యం రూ. 8.63 లక్షల విలువైన ప్రయోగ పరికరాలను ఈసీఈ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు అందజేశారు. జిఎంతో పాటు ఫైనాన్స్ హెడ్ వినయ్ కుమార్, హెచ్ఆర్ మేనేజర్ దేవరాజు కళాశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ప్రారంభించారు. జిఎం మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఈసిఈ, సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఒడిలు శ్రీనివాసులు, శర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమికి బుద్ధి చేప్పేందుకు ప్రజలు సిద్ధం : ఎమ్మెల్యే

బత్తలపల్లి : వచ్చే ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేనపార్టీల కూటమికి గట్టిగా బుద్ధి చెపి, మరోమారు వైసిపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండలం లోని తంబాపురం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వారికి వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిన వైసిపిని మరోమారు ఆదరించాలని కోరారు. అంతకు ముందు గ్రామంలో ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచి సానే జయచంద్రారెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, బయపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మడకశిర



సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరిన నాయకులు

రొళ్ల మండలంలోని హెచ్‌టి హళ్లి గ్రామానికి చెందిన వైసిపి యువకులు సోమవా రం రొళ్ల టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. తిమ్మరాజు, హనుమంతరాయప్ప, బొబ్బురప్ప, దర్శన్, మారెన్న, తిప్పేస్వామి, రంగధామ, కెంచ రంగప్ప, జయరంగప్ప టిడిపిలో చేరగా వారు పార్టీ కండు వా వేసి ఆహ్వానించారు. చేరిన వారు వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి టిడిపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, రవిభూషణ్, సన్న మారేగౌడ్, జయమ్మ పాల్గొన్నారు. అగళి మండల మాజీ జడ్పిటిసి రామకృష్ణయాదవ్ తిరిగి టిడిపిలో చేరాలని తెలుగుతమ్ముళ్లు కోరారు. కార్యక్రమంలో గోవిందప్ప, రంగప్ప, అల్లిఖాన్, ఎంపీటీసీ నాగోజప్ప, సీతన్న, సన్నప్ప, చిదానందప్ప, రామచంద్రప్ప, ముకుంద యాదవ్, రఘు, గంగాధర్, సంపత్‌కుమార్, సోమశేఖర్, కాంత, రంగనాథ, మల్లేశప్ప, ఉమేష్, ప్రవీణ్, అశోక్, నాగరాజు, సురేష్, అంజయ్య, లింగరాజు, మహేష్, నందీశ్, భీమరాజు, జయరంగ, జనసేన నాయకుడు హరీష్, రఘు, మంజునాథ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బత్తలపల్లి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి వైరు చోరీ చేయడానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన బత్తలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు తెలిపిన వివరాలు.. బత్తలపల్లికి చెందిన తొలచూరి పెద్ద వెంకటేష్ వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, రాగి వైరు చోరీ చేయడానికి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆక్సా బ్లేడు పట్టుకుని విద్యుత్ పోల్ ఎక్కడంతో 11 కెవి విద్యుత్ లైన్ తగలడంతో షాక్‌కు గురై పోల్‌పైనే మృతిచెందాడు. సోమవారం సాయంకాలం పొలం వద్దకు వెళ్లిన యజమాని పోల్‌పై శవం వేలాడుతుండడం గమనించి సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ పి.శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఎఇ శివయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం రాత్రి చోరీ చేయడానికి వచ్చి మృత్యువాత పడినట్లు వారు అనుమానిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి వయసు 30 ఏళ్లు ఉంటుంది. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసినవారు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ...

పరిగి : స్థానిక చెరువు కట్ట వద్ద మడకశిర వైపు వెళ్లే రహదారిలో ఆదివారం రాత్రి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. ధనాపురం నుంచి ద్విచక్ర వాహనంపై పరిగి వైపు వస్తున్న ఎరుకల వెంకటేష్, బోరెడ్డిపల్లి అశ్వత్థరెడ్డిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అశ్వత్థరెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సత్య నారాయణ తెలిపారు.

వ్యాపారవేత్తపై దాడి

మడకశిర : పట్టణంలోని మారుతి నగర్‌లో ఉన్న వేరుశనగ మిల్లులో సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వ్యాపారవేత్త ఎస్.గోపాలకృష్ణపై మారణా యుధాలతో దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపాలకృష్ణ తీవ్రంగా గాయపడడంతో మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గతంలో గోపాలకృష్ణ భూమి కొనుగోలు చేశాడు. అందులో తమకు వాటా వస్తుందని కొందరు దాడి చేసినట్లు తెలిసింది. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు గోపాలకృష్ణపై దాడిని ఖండించడంతో పాటు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి

కొత్తచెరువు : జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కషి చేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కదిరప్ప, మైనార్టీ ఉపాధ్యక్షులు షామీర్ పిలుపునిచ్చారు. వారు సోమవారం మండల కన్వీనర్ బెల్లం నజీర్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను అధిష్టానం ప్రకటించిన వెంటనే వారి గెలుపే ధ్యేయంగా పని చేయాల న్నారు. గతంలో కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించా లన్నారు. మేనిఫెస్టోలో చేపట్టబోయే పథకాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో షబ్బీర్, మోహన్, జగదీష్, షమీవుల్లా, ఆనందకుమార్ పాల్గొన్నారు